క్లుప్తంగా

అంగన్‌వాడీ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న దృశ్యం

మాడుగుల : అంగన్‌వాడీలో అందిస్తున్న పథకాలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. శనివారం పౌష్టికాహార పక్షోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్నారు. సీడీపీవో శ్రీదేవి ఆధ్వర్యంలో 16 మంది గర్భిణులకు సీమంతాలు, ఆరుగురు చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు.

కె.కోటపాడు : గర్భిణులు సంపూర్ణ ఆరోగ్యం కోసం పౌష్టిక విలువలు గల ఆహారాన్ని తీసుకోవాలని డ్వామా పీడీ పూర్ణిమాదేవి అన్నారు. కె.కోటపాడు ఐసీడీఎస్ కార్యాలయంలో శనివారం పౌష్టికాహార పక్షోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్నారు. గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు.

పాస్టర్లకు గౌరవవేతనం పెంచాలి



బిషప్ ఎస్.మోజేష్

కె.కోటపాడు : రాష్ట్రంలో గల క్రైస్తవ పాస్టర్‌లకు గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకొని సీఎం చంద్రబాబు గౌరవ వేతనాన్ని అందించడం అభినందనీయమని ఉమ్మడి విశాఖ, విజయనగరం జిల్లాల పాస్టర్ ఫెలోషిప్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు బిషప్ ఎస్.మోజేష్ అన్నారు. కె.కోటపాడులో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గౌరవ వేతనాన్ని అందించడం వల్ల రాష్ట్రంలో క్రైస్తవ పాస్టర్ల తరుపున చంద్రబాబుకు ఆయన కృతజ్ఞతలను తెలిపారు. చంద్రబాబు ఎన్నికల ప్రచార సమయంలో క్రైస్తవ పాస్టర్‌లకు అందించే గౌరవ వేతనాన్ని రూ.7వేలకు పెంచుతానన్న హామీని అమలు చేయాలని మోజేష్ కోరారు.

పేలుడు సామగ్రి నిల్వ కేంద్రాల తనిఖీ

రావికమతం : అనుమతుల్లేకుండా బాణసంచా తయారు చేసినా, నిల్వ చేసినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ వెంకటరమణ హెచ్చరించారు. గొంప గ్రామంలో శ్రీజా శాండ్, కొమిర గ్రామంలో భూమి ఎంటర్ ప్రైజెస్ పేలుడు సామగ్రి నిల్వ కేంద్రాలను ఎస్ఐ రఘువర్మ, అధికారుల బృందంతో కలిసి శనివారం తనిఖీలు నిర్వహించారు. శ్రీజా శాండ్ ఎల్ఎల్‌పీ 2014 నుండి మాగజైన్ లైసెన్స్ కలిగి ఉన్నారని, జన సంచారం లేని ప్రాంతంలోనే కలిగి ఉందని తెలిపారు. నిల్వ సమయంలో భద్రతా ప్రమాణాలను పాటించాలన్నారు.

రన్ ఫర్ జీసస్ ర్యాలీ



రన్ ఫర్ జీసస్ ర్యాలీలో పాల్గొన్న దైవజనులు

నర్సీపట్నం : క్రైస్తవ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నర్సీపట్నంలో శుక్రవారం క్రైస్తవ శాంతి ర్యాలీ నిర్వహించారు. రన్ ఫర్ జీసస్ కార్యక్రమంలో దైవజనులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సీబీఎం కాపౌండ్ నుండి ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. సర్వ మానవాళి పాపం నిమిత్తం సిలువలో మరణించి తిరిగి లేచిన ఏసుప్రభు గుర్తు చేసుకునే నిమిత్తం రన్ ఫర్ జీసస్ నిర్వహించారు. పాస్టర్లు కృష్ణారావు, బెంజమన్, యోహను, నవీన్ కుమార్, దేవానంద్, కెనడీ, కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

వడ్డాదిలో మంచినీటి బోరు ఏర్పాటు



వడ్డాదిలో మంచినీటి బోరును ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ రాంబాబు

బుచ్చెయ్యపేట : మేజర్ పంచాయితీ వడ్డాదిలో కుబిరెడ్డి వారి కళ్లాలు వద్ద మంచినీటి బోరు పనులను ప్రారంభించారు. జెడ్పీటీసీ నిధుల నుంచి తాగునీటి బోరుకు నిధులు మంజూరు చేయించారు. శనివారం బోరు రిగ్ పనులను జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లీలావతి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

మాడుగుల : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. ఆస్పత్రిలో విద్యుత్, తదితర ప్రమాదాలు జరిగినపుడు తీసుకోవలసిన ముందస్తు జాగ్రతలు వివరించారు. కార్యక్రమంలో ఫైర్ అధికారి రాజేశ్వరరావు, సిబ్బంది, ఆస్పత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కూడు పెట్టని ఉపాధి

జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలు పస్తులుంటున్నారు. సుమారు మూడు నెలలుగా ఎండలో పనులు చేస్తున్నా కూలీ డబ్బులు అందడం లేదు. 12 వారాలుగా పనులు చేస్తున్నా ప్రభుత్వం వారికి బిల్లులు చెల్లించడం లేదు. కూలి డబ్బులు అందించి ఆదుకోవాలని కూలీలు గొంతెత్తి అడుగుతున్నా వారి ఆకలి కేకలు అధికారుల చెవికెక్కడం లేదు. బుచ్చెయ్యపేట మండలంలో సుమారు రూ.2.5 కోట్ల వేతన బకాయిలు చెల్లించాల్సి ఉంది.



బుచ్చెయ్యపేట చెరువులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు



కందిపూడిలో ఎండలో ఉపాధి పనులు

- గోడు పట్టని ప్రభుత్వం
- కూలీలకు మూడు నెలలుగా అందని వేతనాలు
- రోజువారి పనులకు 6 వేల మంది హాజరు
- రూ.2.5 కోట్ల వేతన బకాయిలు

బుచ్చెయ్యపేట : బుచ్చెయ్యపేట మండలంలో 35 పంచాయితీల్లో జాతీయ ఉపాధి హామీ పథకం పనులు జరుగుతున్నాయి. చెరువులు, పంట కాలువలు, పొలాల రోడ్లు, కొండ ప్రాంతాల్లో నీరు నిలదేలా ట్రెంచ్‌లు ఏర్పాటు, నీటి గుంతలు, శ్మశానాల్లో తుప్పలు, డొంకలు తొలగింపు, భూమి లెవిలింగ్ తదితర పనులు జోరుగా సాగుతున్నాయి. మండలంలో సుమారు 18,300 వరకు జాబ్ కార్డులుండగా 13,500 జాబ్ కార్డుదార్లు ఉపాధి పనులకు వెళ్తున్నారు. సగటున ప్రతి రోజూ 6 వేల మంది కూలీలు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులకు హాజరవుతున్నారు. ఉదయం 6 గంటలకే ఉపాధి పనులకు హాజరై మధ్యాహ్నం ఒంటి గంట వరకు పనులు చేస్తున్నారు. ఒక్కో కూలీకి సగటున రోజువారి కూలీ రూ. 307 అందించాల్సి ఉంది. ఈ ఏడాది జనవరి ఆఖరు వారం నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం కూలీలకు అందించాల్సిన బకాయిలను విడుదల చేయలేదు. దీంతో రోజువారి కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏ రోజు కూలి డబ్బులు ఆ రోజే అందుకుని చాలా మంది నిరుపేద కూలీలు పప్పులు, ఉప్పు, ఇంట్లో ఇతర నిత్యవసర వస్తువులు కొనుగోలు చేసి జీవనం సాగిస్తారు. మూడు నెలలుగా ఉపాధి డబ్బులు రాక అర్ధాకలితో పలువురు కూలీలు అలమటిస్తున్నారు. సుమారు రెండున్నర కోట్ల రూపాయల వరకు బుచ్చెయ్యపేట మండలానికి ఉపాధి నిధులు మంజూరు కావాల్సి ఉంది.

రోడ్డెక్కిన కూలీలు...

మండల కేంద్రం బుచ్చెయ్యపేట గ్రామంలోనే ప్రతి రోజూ 700 మంది వరకు కూలీలు పనులు చేస్తుండగా వడ్డాది, గున్నెంపూడి, రాజాం, దిబ్బిడి, పెదమదీన, పొట్టిదొరపాలెం, పెదపూడి, తురకలపూడి, ఆర్.భీమవరం తదితర గ్రామాల్లో 400 నుంచి 500 మంది కూలీలు ప్రతి రోజు ఉపాధి పనులు చేస్తున్నారు. వీరందరికీ ఒక్కొక్కరికి రూ. 20 వేలకు పైగా కూలి డబ్బులు అందాల్సి ఉంది. కూలీ డబ్బులు అందించి ఆదుకోవాలని రోజూ ఉపాధి కూలీలు అధికారులను, నాయకులను విన్నవించినా పట్టించుకోవడం లేదు. దీంతో పలు గ్రామాల ఉపాధి కూలీలు రోడ్డెక్కి కూలి డబ్బులు అందించాలని ఆందోళనలకు సిద్ధమౌవుతున్నారు.

ఏం తిని బతకాలి...



నేను ప్రతి రోజూ ఉపాధి పనులకు వెళ్తున్నాను. నా భర్త లేకపోవడంతో కుటుంబాన్ని నేనే కష్టపడి పోషించాలి. నా కుమారుడి ఆరోగ్యం బాగుండకపోవడంతో ఎండను సైతం లెక్కచేయకుండా చేతులు బొబ్బలెక్కుతున్నా ఉపాధి పనులకు వెళ్తున్నాను. నాకు పది వారాల డబ్బులు రావాలి. ఏ వారం డబ్బులు ఆ వారం ఇవ్వకపోతే నాలాంటి వాళ్లు ఎలా బతకాలి, ఏం తినాలి, ఎలా జీవించాలి.

– కంఠంరెడ్డి వరహాలమ్మ, కందిపూడి ఉపాధి కూలీ

నెలల తరబడి డబ్బులివ్వకపోతే ఎలా..



బయట పనులు మానుకుని ఉపాధి పనులకు వెళ్తున్నాను. ప్రభుత్వ పనులైతే డబ్బులు ఎక్కడికీ పోవని నమ్మకం. ఉదయాన్నే లేచి 6 గంటలకే పనులకెళ్లి మధ్యాహ్నం వరకు కష్టపడి పని చేసినా నెలల తరబడి డబ్బులు అందించకపోతే మాలాంటోళ్లు ఏం తిని జీవించాలి. మాకు రావాల్సిన ఉపాధి బకాయిలు వెంటనే అందించాలి.

–కలవలపల్లి మాలునాయుడు, శింగవరం ఉపాధి కూలీ

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..



బుచ్చెయ్యపేట మండలంలో అన్ని గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు ప్రతి రోజూ పనులు కల్పిస్తున్నాం. రోజుకు 6 వేల మంది వరకు ఉపాధి పనులకు వస్తున్నారు. పని కావాలన్న ప్రతి ఒక్కరికి సొంత గ్రామాల్లోనే పని కల్పిస్తున్నాం. కూలీలకు బకాయిలు చెల్లించాల్సి ఉంది. బకాయిల విడుదలపై పై అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. జనవరి నెలాఖరు నుంచి కూలీలకు డబ్బులు పడాల్సి ఉంది. అందరు కూలీలకు పేమెంట్లు జరిగేలా చర్యలు చేపడుతున్నాం.

– వరహాలబాబు, ఏపీవో, బుచ్చెయ్యపేట

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు



రాచపల్లిలో నూతన మోటార్ను ప్రారంభిస్తున్న ఎంపీపీ సర్వేశ్వరరావు

మాకవరపాలెం: గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు ఎంపీపీ రుత్తల సర్వేశ్వరరావు అన్నారు. మండలంలోని రాచపల్లిలో మండల పరిషత్ నిధులు నూతనంగా ఏర్పాటు చేసిన తాగునీటి మోటార్, బోర్లను శనివారం జెడ్పీటీసీ పెట్ల సత్యవేణితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఈ వేసవిలో ప్రజలకు ఎక్కడా తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మరమ్మతులకు గురైన బోర్లు, పథకాలను సకాలంలో వినియోగంలోకి తీసుకురావాలన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ



ప్రమాద బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే రాజు

చోడవరం రూరల్: అగ్నిప్రమాదంలో పూరిళ్లు దగ్ధమై సర్వం కోల్పోయిన బాధితులకు ముఖ్య మంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందేలా కృషి చేస్తానని చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు హామీ ఇచ్చారు. లక్ష్మీపురం రెండో పాల సెంటర్ దరి మలసాల పూర్ణమ్మ ఆమె కుమార్తె గోవిందమ్మ టిఫిన్ దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల వారు ఉపాధి హామీ పనుల నిమిత్తం వెళ్లగా పూరింట్లోని విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి క్షణాల్లో ఇల్లు కాలిబూడిదయ్యింది. శనివారం ఎమ్మెల్యే రాజు, మాజీ సర్పంచ్ సత్యారావు ఆ కుటుంబాన్ని పరామర్శించారు.

లిటిల్ చాంప్స్ ఒలింపియాడ్ విజేతలకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న తహసీల్దార్ రమేష్‌బాబు

కె.కోటపాడు : ప్రతిభా పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ ద్వారా విద్యార్థుల సామర్థ్యం వెలుగుచూస్తుందని తహసీల్దార్ డి.రమేష్‌బాబు అన్నారు. కె.కోటపాడు అయ్యన్న పాఠశాలకు చెందిన విద్యార్థులు లిటిల్ చాంప్స్ ఒలింపియాడ్, ఐఐటీ నీట్ ఫౌండేషన్ కోర్సులు, సాట్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభను చూపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్, ప్రశంసాపత్రాలను శనివారం తహసీల్దార్ రమేష్‌బాబు చేతుల మీదుగా అందించారు. విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్, స్కూల్ డైరెక్టర్ నూర్జహన్ పాల్గొన్నారు.

పౌరసేవలపై విద్యార్థులకు అవగాహన



పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన విద్యార్థులు

కె.కోటపాడు : మండల స్థాయిలో వివిధ శాఖల ద్వారా అందుతున్న పౌరసేవలపై మండల విద్యాశాఖాధికారులు సత్యనారాయణ, డి.వి.డి.ప్రసాద్‌లు శనివారం రెండు పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రొంగలినాయుడుపాలెం, గుల్లేపల్లి ప్రాథమిక పాఠశాలలకు చెందిన పది మంది విద్యార్థులకు అధ్యయన యాత్ర నిర్వహించారు. విద్యార్థులను కె.కోటపాడులో పోలీస్‌స్టేషన్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, తహసీల్దార్ కార్యాలయం, స్టేట్ బ్యాంక్‌లకు తీసుకువెళ్లి ఆయా కార్యాలయాల్లో ప్రజలకు పౌరసేవలను సిబ్బంది ఏ విధంగా అందిస్తున్నారో క్షేత్ర స్థాయిలో చూపించి అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు ఎస్.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, వాసంతి పాల్గొన్నారు.

ఎంపీటీసీ సభ్యుల వితరణ



కోఆప్షన్ సభ్యుడి భార్యకు ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎంపీపీ గాడి కాసులమ్మ

చోడవరం : మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు షేక్ అబ్దుల్ రెహమాన్ ఇటీవల మృతి చెందారు. ఆయనది లక్ష్మీపురం గ్రామం. స్థానిక ఎంపీటీసీ సభ్యులు అందరూ కలిసి రూ.30 వేలు నగదును శనివారం ఎంపీపీ గాడి కాసులమ్మ చేతుల మీదుగా లక్ష్మీపురం గ్రామంలో రెహమాన్ భార్య షేక్ ఆస్మా బీబీకి అందజేశారు. రెహమాన్ రెండవ కుమార్తె షేక్ అప్సన్ బేగం డిగ్రీ వరకు చదువుకునేందుకు చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి గుడివాడ అమర్‌నాథ్ సహకారం అందిస్తారని గోవాడ సర్పంచ్ ఏడువాక సత్యారావు తెలిపారు. వైస్ ఎంపీపీ ఈశ్వరరావు కుమారి, రాజునాయుడు, వీరన్నతో పాటు భవానీ, గణపతి పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్రకు సహకరించండి



మాడుగుల బస్టాండ్ ఆవరణలో ఈ వేస్ట్ స్టాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు



ఎ.కొత్తపల్లిలో స్వర్ణాంధ్ర ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ బుల్లిలక్ష్మి, సర్పంచ్ సత్య వెంకటరమణ

మాడుగుల రూరల్: స్వచ్ఛ ఆంధ్ర- స్వరణ ఆంధ్రతో నినాదంతో ప్రతి పల్లె గ్రామాన్ని పరిశుభ్రంగా వుంచడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, నియోజకవర్గ ప్రత్యేకాధికారి, జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు పేర్కొన్నారు. శనివారం మాడుగులలో పరిసరాలు పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రీన్ అంబాసిడర్లు, పారిశుధ్య కార్మికులతో కలసిచెత్త తొలగించారు. బస్టాండ్ ఆవరణలో ఇ-వేస్ట్ కలక్షన్ సెంటరును ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ప్రారంభించారు. రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ కుమార్, మార్కెట్టు కమిటీ చైర్మన్ అప్పలరాజు పాల్గొన్నారు.

రోలుగుంట: మండల కేంద్రంలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ వేస్ట్‌ను గ్రామ క్లాప్ మిత్రల ద్వారా సేకరించి పంచాయతీ కార్యాలయంలో ఈ వేస్ట్ కలెక్షన్ సెంటర్‌కు తరలించారు.

మాకవరపాలెం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని మండల ప్రత్యేక అధికారి రామ్మోహన్‌రావు అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛ దివస్ నిర్వహించారు. మండల కేంద్రంలోని సచివాలయం వద్ద పనికిరాని ఎలక్ట్రికల్ వ్యర్థాలను సేకరించి, వాటిని ఇళ్లలో ఉంచడం ద్వారా కలిగే ఇబ్బందులను వివరించారు.

మాడుగుల : స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శాస్త్రి పాల్గొన్నారు.

చీడికాడ : మన గ్రామాలను మనమే పరిశుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి అన్నారు. శనివారం మండలంలో స్వచ్ఛంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల భాగస్వామ్యాలతో వీధులు శుభ్రపరిచారు. లైబ్రేరియన్ జోగేశ్వరి లైబ్రరీ పరిసరాల్లో చెత్త తొలగించారు.

దేవరాపల్లి : స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని స్థానిక ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి సూచించారు. ఎ.కొత్తపల్లిలో సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. బోయిలకింతాడలో సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బాబురావు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

నాతవరం : గ్రామాలు శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు రాకుండా కాపాడుకోవచ్చునని మండల ప్రత్యేకాధికారి నాగ శిరీష, ఎంఈవో కామిరెడ్డి వరహాలబాబు అన్నారు. మండల కేంద్రంలో ఎంఈవో వరహాలబాబు, మర్రిపాలెంలో నాగ శిరీష ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్రా స్వర్ణ ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహించారు. మర్రిపాలెంలో ప్రత్యేకాధికారి పర్యటించి ప్రజలకు పలు సూచనలు చేశారు.

వేసిన రోడ్లపైనే మళ్లీ సీసీ రోడ్లు!

- జాలంపల్లి పంచాయతీలో మేట్లు తొలగింపు అన్యాయం
- మండల సమావేశంలో ప్రజా ప్రతినిధుల ఆగ్రహం
- శాఖాల వారీగా ఎమ్మెల్యే బండారు సమీక్ష



పంచాయతీరాజ్ పనులపై అధికారులను నిలదీస్తున్న మాజీ ఎంపీపీ పెదబాబు

మాడుగుల రూరల్: గత ప్రభుత్వ హయాంలో వేసిన సీసీ రోడ్లు మీద పంచాయతీ తీర్మానం లేకుండా మళ్లీ రోడ్లు నిర్మాణం చేపట్టడం ఎంతవరకు సబబని మాజీ ఎంపీపీ వేమవరపు రామధర్మజ(పెదబాబు) అధికారుల తీరు పట్ల మండల సర్వ సభ్య సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల సర్వసభ్య సాధారణ సమావేశం మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. సమావేశానికి ఎంపీపీ వెంకటరాజారామ్ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పాల్గొని శాఖల వారీగా అధికారులతో సమీక్షించారు. జల్‌జీవన్ మిషన్ పథకంలో పనులు పూర్తి కాక గ్రామాల్లో ప్రజలు తాగునీటి సమస్య ఎదుర్కొటున్నారని పొంగలిపాక, జంపెన, సర్పంచ్‌లు దేముడమ్మ, గురువులునాయుడు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మంజూరై 25 శాతం పనులు పూర్తికాక పోవడం వల్ల పనులు రద్దు చేశారని, ఈ పనులు తిరిగి చేపట్టేందుకు మండల పరిషత్ తీర్మానంతో ఎమ్మెల్యే దృష్టికి తీసుకొస్తామన్నారు. ఉపాధికి సంబంధించి సమీక్షలో జాలంపల్లి పంచాయతీ శివారు లోవకొత్తపల్లికి చెందిన ఇద్దరు మేట్లను అన్యాయంగా తొలగించారని జెడ్పీటీసీ సభ్యురాలు కిముదు రమణమ్మ ఏపీవోను నిలదీశారు. దీనికి ఏపీవో మధు బదులిస్తూ మేట్లు విధిగా పదో తరగతి చదివి వుండాలని జీవో జారీ చేశారని తెలిపారు. మాజీ ఎంపీపీ పెదబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మేట్లను అన్యాయంగా తొలగించలేదన్నారు. ఆర్అండ్‌బీ పనులకు సంబంధించి సమీక్షలో జేఈ సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ వడ్డాది నుంచి తాటిపర్తి వెళ్లే రహదారి నిర్మాణ పనులకు గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరయ్యాయని, అయితే గుత్తేదారుడు ఈ పనులు చేపట్టలేదని అన్నారు. ఈ పనులు ప్రస్తుతం జరుగుతున్నాయని, రహదారికి రూ.23.30 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. తాజాగా ఆరున్నర కోట్ల రూపాయలు నిధులు కోత విధించారన్నారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత లోపించిందని ఎం.కోటపాడు సర్పంచ్ గంగాధర్ అన్నారు. ఎం.కోటపాడు వద్ద రెండు వైపులా సీసీ డ్రైనేజీలు నిర్మించాలని సభలో ఎమ్మెల్యేను కోరారు.

ఈ-వేస్ట్‌పై అవగాహన ర్యాలీ

కె.కోటపాడు : పాత ఎలక్ట్రికల్ వస్తువులను రీసైకిల్ నిర్వహించేందుకు ప్రజలు స్వచ్ఛందంగా వాటిని గ్రామ పంచాయతీ ద్వారా ఏర్పాటు చేసిన ఈ-వేస్ట్ కలెక్షన్ సెంటర్‌కు అందించాలని చౌడువాడ గ్రామ పంచాయతీ కార్యదర్శి పి.సురేష్‌బాబు కోరారు. ప్రతి నెలా మూడో శనివారం నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం సందర్భంగా పరిశుభ్రత, పారిశుధ్యం మెరుగు-ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యంపై శనివారం గ్రామంలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్ పాల్గొన్నారు.

దేవరాపల్లి: తహసీల్దార్ కార్యాలయంలో ఎల్రక్టానిక్ వ్యర్థాలను తహసీల్దార్ పి.లక్ష్మీదేవి సమక్షంలో శనివారం సేకరించారు. అంతకు ముందు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో చెత్తా చెదారాలను తొలగించారు. డీటీ అప్పారావు, రీసర్వే డీటీ గపూర్, సర్వేయర్ గోవిందరాజులు, ఆర్ఐ సతీష్, వీఆర్‌వోలు, వీఆర్ఏలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఈదురుగాలుల బీభత్సం



సూదివలసలో ఓ ఇంటిపై కూలిన తాటిచెట్టు

కె.కోటపాడు : మండలంలో సూదివలస గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షానికి సూదివలస కూడలి నుంచి గ్రామంలోకి వెళ్లే తారురోడ్డులో పలు చోట్ల చెట్లు కూలాయి. సూదివలస జంక్షన్ వద్ద విద్యుత్ స్తంభం నేలకొరగడంతో శుక్రవారం రాత్రి గ్రామంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. వీటితో పాటు సూదివలస గ్రామంలో ఓ ఇంటి సమీపంలో తాటి చెట్టు ఇంటిపై కూలింది. దీంతో భవనం పలుచోట్ల దెబ్బతింది. శనివారం ఉదయం నుంచి పంచాయితీ, రెవెన్యూ, ఎలక్ట్రికల్ సిబ్బంది చెట్లను తొలగించి, విద్యుత్ పునరుద్ధరించారు. పునరుద్ధరణ పనులను సర్పంచ్ సన్యాసినాయుడు, ఎంపీటీసీ రామునాయుడు, పంచాయితీ కార్యదర్శి ప్రకాష్, వీఆర్వో అనంత్ పర్యవేక్షించారు.

తెగిపడిన విద్యుత్‌వైర్లు

నాతవరం : ఇటీవల ఈదురు గాలులతో కురిసిన వర్షాలకు విద్యుత్ స్తంభాలు పలు చోట్ల నేలమట్టమయ్యాయని నాతవరం విద్యుత్‌శాఖ జేఈ చంద్రమౌళి అన్నారు. శనివారం మండలంలో పలు గ్రామాల్లో దెబ్బతిన్న విద్యుత్ వైర్లను పునరుద్ధరించారు. మండల వ్యాప్తంగా ఈదురు గాలులకు పదిపైగా విద్యుత్ స్తంభాలు కూల విద్యుత్ వైర్లు తెగిపోయాయన్నారు. పిడుగు పాటుకు విద్యుత్ స్తంభాలపై ఉండే కన్సలేటర్లు సైతం కాలిపోయాయన్నారు. ఆయా చోట్ల మరమ్మతులు చేసి విద్యుత్ పునరుద్ధరించామన్నారు.

'వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించం'

నర్సీపట్నం : మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌ను విమర్శించే స్థాయి కౌన్సిలర్ మధుకు లేదని, ఆయన నోరు అదుపులో పెట్టుకోవాలని మున్సిపాలిటీ వైఎస్సార్‌సీపీ యూత్ నాయకులు అల్లంపల్లి ఈశ్వరరావు ధ్వజమెత్తారు. స్క్రిప్ట్ చదవడం కూడా రాని మధు ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే సహించబోమని హెచ్చరించారు. మధును కౌన్సిలర్‌గా ఎన్నుకున్నందుకు ఆ వార్డు ప్రజలు బాధపడుతున్నారని అన్నారు.

షిర్డీసాయి ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

మాడుగుల రూరల్ : ఎం.కోడూరు గ్రామంలో నిర్మాణంలో షిర్డీసాయి ఆలయం నిర్మాణానికి గ్రామానికి చెందిన గొల్లవిల్లి రామారావు, రత్నం దంపతులు, వారి కుమారులు గణేశ్, రమేష్ రూ.30వేల విరాళం ఆలయ కమిటీ సభ్యుడు అప్పలనాయుడుకు అందజేశారు.

150 పశువులకు వైద్య పరీక్షలు

మాకవరపాలెం: తామరంలో నిర్వహించిన పశువైద్య శిబిరంలో శనివారం 150 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మాకవరపాలెం, రాచపల్లి వైద్యాధికారులు మణిదీప్, అనిల్ 50 పశువులకు గర్భకోశ వ్యాధులపై పరీక్షలు చేసి మందులిచ్చారు. 100 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ టీకాలు వేశారు.

సారాబట్టీలపై దాడులు

రావికమతం :జెడ్.జోగింపేట సమీపంలో సారా స్థావరాలపై శనివారం ఎక్సైజ్ పోలీసులు దాడులు చేశారు. 104 లీటర్ల సారా , 40 కేజీల నల్ల బెల్లం, 10 కేజీల అమ్మోనియా పిండిని స్వాధీనం చేసుకొని, 2400 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేసినట్టు మాడుగుల ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర తెలిపారు. గ్రామానికి చెందిన పాడి కొండమ్మను అరెస్టు చేసి, మరో నలుగురిపై కేసు నమోదు చేశామన్నారు.